సాక్షి
ఆదిలాబాద్
బుధవారం : 13 : మార్చి : 2024

సస్పెన్షన్ ఎత్తివేయాలి

ఎదులాపురం: మామిడిగూడ ఆశ్రమ పాఠశాల హెడ్‌మాస్టర్‌పై విధించిన సస్పెన్షన్, సీఆర్టీపై విధించిన టెర్మినేషన్‌ను ఎత్తివేయాలని కోరుతూ తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా బాధ్యులు మంగళవారం కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇందులో తపస్ జిల్లా అధ్యక్షుడు సునీల్ చౌహాన్, గోపీకృష్ణ, తదితరులున్నారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధ : 6:26	గురు : 5:04

గరిష్టం/కనిష్టం
39.0/24.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత పెరగనుంది. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్



జిల్లా జడ్జికి పూలమొక్క అందజేస్తున్న కలెక్టర్

ఆదిలాబాద్‌టౌన్: కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాజర్షిషా మంగళవారం జిల్లా జడ్జి సీహెచ్ వీఆర్‌ఆర్ వరప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కోర్టుకు వెళ్లి పూలమొక్క అందజేశారు.

ఇంటర్ పరీక్షల్లో 503 మంది గైర్హాజరు

ఆదిలాబాద్‌టౌన్:ఇంటర్మీడియెట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం ద్వితీయ సంవత్సరం ఫిజికల్‌సైన్స్, ఎకనామిక్స్ పరీక్షలు నిర్వహించారు. జనరల్ కోర్సులో 8,412 మందికి గాను 8,001మంది హాజరయ్యారు. 411 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సులో 1,008 మందికి గాను 916 మంది హాజరయ్యారు. 92 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో రవీంద్ర కుమార్ తెలిపారు.

కార్మికులతో చర్చలు విఫలం



కార్మికులతో చర్చిస్తున్న కాంట్రాక్టర్ ప్రతినిధి

ఆదిలాబాద్‌టౌన్: జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రిమ్స్ కార్మికులు చేపట్టిన సమ్మె నాలుగో రోజుకు చేరింది. ఈ మేరకు కాంట్రాక్టర్‌కు సంబంధించిన వ్యక్తి మంగళవారం దీక్ష శిబిరం వద్దకు వచ్చి కార్మికులతో చర్చలు జరపగా విఫలమయ్యాయి. సమ్మె విషయంతో పాటు వేతనంలో దోపిడీకి పాల్పడుతున్న తీరును కార్మికులు సోమవారం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కాంట్రాక్టర్ చర్చలు జరిపారు. జీవో నం.60 ప్రకారం వేతనాలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పిస్తామని రాతపూర్వకంగా రాసిస్తేనే సమ్మె విరమిస్తామని పేర్కొన్నారు. సదరు వ్యక్తి ఒప్పుకోకపోవడంతో సమ్మె కొనసాగిస్తున్నట్లు కార్మికులు పేర్కొన్నారు. ఇందులో రాజేందర్ సింగ్, శ్రీనివాస్, రాము, రుక్మిణి, ఇక్బాని, ఖదీర్, సునిత, లక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

'వన్‌స్టేషన్- వన్ ప్రొడక్ట్' ప్రారంభం

ఆదిలాబాద్: స్థానిక ఆహార ఉత్పత్తులను ప్రోత్సహించడమే లక్ష్యంగా వన్ స్టేషన్-వన్ ప్రొడక్ట్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డివిజనల్ మేనేజర్ రామచంద్ర సాహూ అన్నారు. దేశవ్యాప్తంగా వన్ స్టేషన్-వన్ ప్రొడక్ట్ కేంద్రాల ప్రారంభోత్సవాన్ని వర్చువల్ విధానంలో ప్రధాన మోదీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మహతో, డీఎస్పీ జీవన్‌రెడ్డి తదితరులతో కలిసి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రామచంద్ర సాహు మాట్లాడుతూ.. స్థానికంగా లభ్యమయ్యే ఉత్పత్తులకు ప్రాచుర్యం కల్పించే దిశగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ కేంద్రం నిర్వహణద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు లభ్యమవుతాయన్నారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వేమెంబర్ జీవీ రమణ తదితరులున్నారు.

రైల్వే బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలి

ఆదిలాబాద్: జిల్లాకేంద్రంలోని రైల్వేఓవర్, అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో ప్రిన్సిపల్ సెక్రటరీని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట స్థానిక బీజేపీ నాయకులు, వ్యాపారస్తులు ఉన్నారు.

ప్రొవిజినల్ జాబితా విడుదల

ఎదులాపురం: జిల్లా వైద్యారోగ్యశాఖ ఎన్‌హెచ్‌ఎం పరిధిలో ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసిన ఉద్యోగాలకు సంబంధించి ఏమైనా పొరపాట్లు ఉంటే సరిచేసుకోవాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ ప్రకట నలో తెలిపారు. మెడికల్ ఆఫీసర్, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్, పీపీఎం, ఏసీఎస్‌ఎం కోఆర్డినేటర్, సీని యర్ డాట్స్ ప్లస్ టీబీ, హెచ్‌ఐవీ, టీబీహెచ్‌వీలకు సంబంధించిన ప్రొవిజినల్ జాబితా విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఆయా అభ్యర్థుల వివరాలు కార్యాలయ నోటీసుబోర్డు, http://adilabad. telan gana. gov. in లో అందుబాటులో ఉంచినట్లు పే ర్కొన్నారు. అభ్యర్థులు ఈనెల 13,14 తేదీలలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు పొరపాట్లు ఉంటే సరి చేసుకోవాలని సూచించారు.





పేదలకు భరోసా..

- రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయాలు
- రేషన్‌కార్డుల జారీకి గ్రీన్ సిగ్నల్
- మహిళలకు రూ.10లక్షల బీమా
- 'ఇందిరమ్మ'తో సొంతింటి కల సాకారం

కైలాస్‌నగర్: అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలతో పాటు ప్రజా పాలనను అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం సమావేశమైన రాష్ట్ర కేబినేట్ వివిధ వర్గాలకు మేలు చేకూర్చేలా కీలక నిర్ణయాలు తీసుకుంది. సుదీర్ఘకాలంగా నిరీక్షిస్తున్న రేషన్ కార్డుల జారీకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా, సొంతింటి కల సాకారం చేసే దిశగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను చేపట్టనుంది. మహిళా సాధికారతపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం వారికి బీమా కల్పించాలని నిర్ణయించింది. సమావేశం అనంతరం మంత్రులు వెల్లడించిన నిర్ణయాలతో ఆయావర్గాల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

మూడేళ్ల నిరీక్షణకు తెర..

కొన్నేళ్లుగా రేషన్‌కార్డుల జారీ నిలిచిపోయింది. దీంతో కొత్తగా పెళ్లయిన జంటలు, అలాగే వివాహమై పిల్లలు పుట్టి ఏళ్లు గడుస్తున్నా రేషన్‌కార్డులు లేక చాలా మంది ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. ఆరోగ్యశ్రీ సేవలను పొందలేకపోతున్నారు. కార్డుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అలాంటి వారికి రేవంత్ సర్కారు తీపి కబురునందించింది. కొత్త రేషన్ కార్డుల జారీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జిల్లాలో సు మారు 3వేల వరకు అర్హులు ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం 4,765 మంది దరఖాస్తు చేసుకొని ఆరేడేళ్లుగా నిరీక్షిస్తున్నారు. దీనిపై మాత్రం ప్రభుత్వం స్పష్టతనివ్వలేదు. కొత్తకార్డుల జారీ నేపథ్యంలో మార్పులు, చేర్పులకు కూడా అవకాశం కల్పిస్తే వీరందరికీ లబ్ధి కలిగే అవకాశం ఉంది.

బీమాతో మహిళలకు ధీమా..

మహిళా సాధికారత దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు రూ.10లక్షల బీమా సౌకర్యం కల్పించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఆర్థికంగా వారు మరింత ముందుకు సాగేలా జీరో వడ్డీకే బ్యాంకు రుణాలు అందించాలని నిర్ణయించింది. ఈమేరకు జిల్లాలోని 10వేల స్వయం సహాయక సంఘాల్లోని సుమారు 1.5లక్షల మంది మహిళలు లబ్ధి పొందనున్నారు.

బీసీ కార్పొరేషన్లతో ఆర్థిక పరిపుష్టి

వెనుకబడిన తరగతుల వారి అభ్యున్నతి కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా బీసీ కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఆయా కార్పొరేషన్లకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించనున్నారు. గత పదేళ్లుగా ఎలాంటి రుణాలు పొందనటువంటి బీసీలకు వీటి ద్వారా ఆర్థిక పరిపుష్టి కలిగి స్వయం ఉపాధి దిశగా అడుగులు వేసేందుకు అవకాశముంటుంది. ఈ నిర్ణయంతో జిల్లాలోని 5లక్షల మందికి పైగా లబ్ధి చేకూరే అవకాశముందని బీసీ సంఘాల నాయకులు చెబుతున్నారు.

సొంతింటి కల నెరవేరనున్న వేళ..

ఏళ్ల తరబడి అద్దె ఇళ్లల్లో అవస్థలు పడుతున్న నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేదిశగా ప్రభుత్వం దృష్టి సారించింది. అర్హులైన పేదలకు ఇందిరమ్మ పథకం ద్వారా పక్కా ఇండ్లను నిర్మించి ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయించింది. సొంత స్థలం కలిగి ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించనుంది. తొలి విడతలో ఒక్కో నియోజకవర్గానికి 3500 చొప్పున ఇళ్లను మంజూరు చేయనున్నారు. కాగా జిల్లా వ్యాప్తంగా 7,400 మంది పేదలు లబ్ధి పొందనున్నారు. మిగతా వారికి దశలవారీగా మంజూరు చేయనున్నారు.

135 మందికి టీచర్ ఉద్యోగాలు..

కోర్టు కేసు నేపథ్యంలో నిలిచిపోయిన 2008 డీఎస్సీ అభ్యర్థులకు ఎట్టకేలకు పోస్టింగ్ దక్కనుంది. అప్పట్లో ప్రభుత్వం డీఎడ్ అర్హతతో 70శాతం, బీఎడ్ అర్హతతో 30 శాతం ఉద్యోగాలను భర్తీ చేసింది. అయితే తమకు అన్యాయం జరిగిందని డీఎడ్ అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. దీంతో అప్పటి నుంచి ఈ ప్రక్రియ నిలిచిపోయింది. డీఎడ్ అభ్యర్థులతో ఆ పోస్టులను భర్తీ చేయాలని గత ప్రభుత్వ హయాంలోనే కోర్టు తీర్పునిచ్చినప్పటికీ ప్రభుత్వ స్థాయిలో ఈ అంశం పెండింగ్‌లో ఉంది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం వారికి ఉద్యోగాలు కల్పించాలని నిర్ణయించడంతో ఉమ్మడి జిల్లాలో 135 మంది డీఎడ్ అభ్యర్థులు ఎస్జీటీ కొలువు పొందనున్నారు.

భగ్గుమంటున్న భానుడు

- తలమడుగులో '40 డిగ్రీలు' క్రాస్..



ఎండలో బైక్‌పై వెళుతున్న మహిళ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో భానుడు భగ్గుమంటున్నాడు. పగటి ఉష్ణోగ్రతలు 40డిగ్రీల మార్క్ దాటడంతో జనం ఇబ్బందులకు గురవుతున్నారు. గడిచిన 10 రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. జిల్లాలో మంగళవారం సరాసరి గరిష్ట ఉష్ణోగ్రత 38.3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. అత్యధికంగా తలమడుగులో గరిష్ట/కనిష్ట ఉష్ణోగ్రతలు 40.8/20.0గా నమోదయ్యాయి. ఎండ తీవ్రతతో జనం అతలాకుతలం అవుతున్నారు. పట్టణంలోని ప్రధాన వీధులు మధ్యాహ్న సమయంలో నిర్మానుష్యంగా మారాయి. మార్చి రెండో వారంలోనే భానుడు తన ఉగ్రరూపం దాల్చుతుండటంతో ఏప్రిల్, మే నెలల్లో ఎండలు మరింత ముదిరే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఎండ తీవ్రతతో వీధివ్యాపారులు, ఉపాధి, వ్యవసాయ కూలీలు, రైతులు, ఇబ్బందులు పడుతున్నారు.

సీఎం సభకు తరలిన ఎస్‌హెచ్‌జీ మహిళలు



ప్రత్యేక బస్సులో తరలివెళ్తున్న మహిళలు

కైలాస్‌నగర్: హైదరాబాద్‌లోని నాంపల్లి పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం నిర్వహించిన మహిళా శక్తి బహిరంగ సభకు జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు తరలివెళ్లారు. సీఎం హాజరయ్యే ఈసభకు 17 మండలాలతో పాటు ఆదిలాబాద్ మున్సిపాలిటీ నుంచి 950 మంది సభ్యులు 19 ప్రత్యేక బస్సుల్లో తరలివెళ్లారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో చదివే విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల ప్రధానోపాధ్యాయులు, వసతిగృహ సంక్షేమాధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల ఆరోగ్యం, తాగునీటి వసతి, ఆహార పదార్థాల నాణ్యత, మౌలిక వసతులపై పాఠశాల వారీగా సమీక్షించారు. ఆయా అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు తాగునీటికి ఇబ్బందులు కలుగకుండా మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా చేయాలన్నారు. ఆర్వో ప్లాంట్ల మరమ్మతులు ఉంటే వెంటనే పూర్తి చేయాలన్నారు. ప్రతీ గురువారం పీహెచ్‌సీ వైద్యాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, అనారోగ్యం, ఎనీమియాతో బాధపడుతున్న వారిని గుర్తించి మెరుగైన వైద్యమందించాలని సూచించారు. ప్రతీవారం ఓ స్కూల్‌ను సందర్శించి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. పెండింగ్ పనులు, మరమ్మతులు ఉంటే ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, డీడీ దిలీప్‌కుమార్, డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, ఈఈ భీంరావ, ఏటీడీవోలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

అంగన్‌వాడీల ఆందోళన

- కలెక్టరేట్ ఎదుట ధర్నా
- బయోమెట్రిక్ నిర్ణయం ఉపసంహరించుకోవాలని డిమాండ్

కైలాస్‌నగర్: బయోమెట్రిక్ హాజరు, కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు ఆందోళన చేపట్టారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అంగన్‌వాడీలను దొంగలుగా చిత్రీకరించడం సరికాదన్నారు. వేసవిలో ఒక పూట బడితో పాటు మే నెలంతా టీచర్స్, ఆయాలకు సెలవులివ్వాలని డిమాండ్ చేశారు. పనిచేయని సెల్‌ఫోన్లను తిరిగి వెనక్కి అప్పగిస్తున్నామన్నారు. సమ్మె కాలంలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ శ్యామలాదేవికి అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన అంగన్‌వాడీలు

సంజాయిషీ వెనుక..

- బీజేపీలో చర్చనీయాంశంగా 'పాయల్' వ్యవహారం
- 'గొడం' చేరిక, అభ్యర్థిత్వం ఖరారు విషయంలో తలెత్తిన గొడవ
- ఆశావహులు ఢిల్లీ చేరడంతో విభేదాలు తెరపైకి..
- తమతో చర్చించలేదని చెప్పిన ఎమ్మెల్యేలు, పార్టీ బాధ్యులు..?
- ఏకపక్ష నిర్ణయమనే అభిప్రాయానికి అగ్రనేతలు
- దీంతో మారిన సీన్



హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ (ఫైల్)

సాక్షి,ఆదిలాబాద్: 'ఆదిలాబాద్ ఎంపీ టికెట్ నగేశ్‌కు ఇవ్వాలని నేను చెప్పలేదు.. 'గొడం'కు నాకు ఎలాంటి వ్యాపార సంబంధాలు లేవు.. ఉన్నాయని నిరూపిస్తే నా పదవికి రాజీనామా చేస్తా.. ఆదిలాబాద్ ఎంపీ టికెట్ ఎవరికి ఇవ్వాలన్నది అధిష్టాన నిర్ణయం.. ఎవరికి ఇచ్చినా అందరం కలిసికట్టుగా పని చేస్తాం..' ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ సోమవారం హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్‌లో అన్న మాటలివి. ఈ సంజాయిషీ ఎమ్మెల్యే ఎందుకు ఇచ్చుకోవాల్సి వచ్చిందన్నది ఆ పార్టీ క్యాడర్‌లో అనుమానాలకు దారి తీసింది. ఢిల్లీ నుంచి తిరిగి వస్తూ కేంద్ర మంత్రి అమిత్‌షా ప్రోగ్రామ్ మంగళవారం ఉండడంతో హైదరాబాద్‌లో ఆగిన పాయల్ శంకర్ అక్కడే విలేకరులతో మాట్లాడిన తీరు ఇప్పుడు వైరల్‌గా మారింది. ఆయన అనుచరుల్లోనూ సందిగ్ధతకు దారి తీసింది.

అందరు ఏకాభిప్రాయంతో ఉన్నారని..

మాజీ ఎంపీ గొడం నగేశ్ బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరిన తర్వాత ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో చోటు చేసుకున్న మునలం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనానికి దారి తీసింది. ఢిల్లీలో ఆశా వహ నేతలు, పార్టీ ముఖ్య బాధ్యులు అగ్రనేతలను కలిసిన తర్వాత అప్పటివరకు జరిగిన తతంగం ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తుంది. ప్రధానంగా ఈ పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలందరి ఏకాభిప్రాయంతోనే గొడం నగేశ్‌ను పార్టీలోకి తీసుకురావడం జరుగుతుందని పార్టీ పెద్దలతో పాయల్ శంకర్ చెప్పారని విస్తృతంగా ప్రచారం జరుగుతుంది. ఢిల్లీ హల్‌చల్‌తో పార్టీ ఎమ్మెల్యేలు ఈ విషయంలో తమను అసలు సంప్రదించనే లేదని చెప్పడం, మాతోనైతే అసలు చర్చించనేలేదని పార్టీ బాధ్యులు పేర్కొనడం సంచలనానికి దారి తీసింది. దీంతోనే నగేశ్ చేరిక ఏకపక్షమన్న అభిప్రాయానికి పార్టీ పెద్దలు వచ్చారని పార్టీలో చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం ఈ పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న పాయల్ శంకర్ డైలామాలో పడ్డట్టు తెలుస్తోంది. దీంతోనే ఆయన ఢిల్లీ నుంచి రాగానే హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టి ఇలాంటి సంజాయిషీ ఇవ్వాల్సి వచ్చిందని చర్చించుకుంటున్నారు. అయితే వ్యాపార సంబంధాలు ఉన్నాయని నిరూపిస్తే పదవికి రాజీనామా చేస్తానని చెప్పడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఢిల్లీకి వెళ్లిన ఆశావహ నేతలు ఈ విషయంలో ఏదైన పార్టీ పెద్దల వద్ద ప్రస్తావించారా.. లేనిపక్షంలో ఆయన నోటివెంట ఇలాంటి వ్యాఖ్యలు ఎందుకు వచ్చాయనేది ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది.

టికెట్ ఎవరికో..

గొడం నగేశ్ చేరిక, ఆ తర్వాత ఈ పార్లమెంట్ పరిధిలోని ముఖ్య నేతలంతా ఢిల్లీ వెళ్లి అగ్రనేతలను కలవడం వంటి సంఘటనలు బీజేపీలో ముసలానికి దారి తీసిన పరిస్థితులను తేటతెల్లం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రెండో జాబితాలో ఆదిలాబాద్ స్థానం అభ్యర్థిని ప్రకటిస్తారా.. లేనిపక్షంలో ఇంకా వేచిచూస్తారా అనేది చూడాల్సిందే. మొత్తంగా ఈ రెండు రోజుల పాటు జరిగిన హైడ్రామా పార్టీలో రక్తి కట్టిస్తోంది.

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష

కైలాస్‌నగర్: రానున్న లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. హైదరాబాద్ నుంచి మంగళవారం ఆయన జిల్లా కలెక్టర్లతో లోక్‌సభ ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటరు జాబితాపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపించి ఎలాంటి తప్పులు లేని జాబితా సిద్ధం చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ముద్రణకు ప్రింటింగ్ ప్రెస్‌ను ముందే గుర్తించాలని, ఎన్నికల్లో హోం ఓటింగ్ ప్రక్రియ సక్రమ నిర్వహణకు సరైన ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. నోటిఫికేషన్ వచ్చేలోగా వీడియో సర్వేలెన్సు, వీడియో వీక్షణ కోసం కెమెరాలు సమకూర్చుకోవాలన్నారు. అసెంబ్లీ తరహాలోనే పార్లమెంట్ ఎన్నికలకు కూడా మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. వీటిపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఆర్వో కార్యాలయంతో పాటు, జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో కమ్యూనికేషన్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సమాచారాన్ని ఈనెల 13 లోగా పంపించాలని, ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది డేటా అప్‌డేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇందులో కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రెయినీ కలెక్టర్ వికాస్ మహతో, జెడ్పీ సీఈఓ రత్నమాల తదితరులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీవో

క్లుప్తంగా

బాసర చేరిన పాదయాత్ర



పాదయాత్రగా వస్తున్న భక్తులు

భైంసా(ముధోల్): మహారాష్ట్రలోని పండరీపూర్‌కు చేపట్టిన పాదయాత్ర మంగళవారం బాసరకు చేరుకుంది. నిజామాబాద్ జిల్లా నందిపేటకు చెందిన పల్లుట్ల శ్రీకేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహరాజ్ ఆధ్వర్యంలో 250 మంది భక్తులతో పాదయాత్ర చేపట్టారు. బాసరలో సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నాక పండరీపూర్‌కు బయలుదేరి వెళ్లారు.

ఇసుక డంపులు స్వాధీనం



ఇసుక డంపుల వద్ద అధికారులు

సర్సాపూర్(జి): మండలంలోని అర్లి (కే) గ్రామ శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను మంగళవారం మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సుమారు 55 ట్రాక్టర్ల ఇసుకను స్వాధీనం చేసుకుని త్వరలో వేలం వేస్తున్నట్లు ప్రకటించారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ ఏడీ క్రాంతి కుమార్, సీఐ శ్రీనివాస్, తహసీల్దార్ సోమ శ్రీనివాస్, ఎస్సై హన్మాండ్లు, ఆర్ఐలు వేణుగోపాల్, సుమలత, పంచాయతీ కార్యదర్శి పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు



స్వర్ణ వాగును పరిశీలిస్తున్న ఏడీ

నిర్మల్: ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని భూగర్భ, జలవనరుల శాఖ ఏడీ క్రాంతికుమార్ అన్నారు. సారంగాపూర్ మండలం ఆలూరులోని స్వర్ణ నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు మంగళవారం ఎస్సై చంద్రమోహన్, ఎంఆర్ఐ ముంతాజ్‌తో కలిసి నదిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేపడితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఒకేరోజు నాలుగిళ్లలో చోరీ



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

లోకేశ్వరం(ముధోల్): మండలంలోని కిష్టాపూర్‌లో ఒకేరోజు నాలుగిళ్లలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన సురేష్, నరేశ్, నవీన్, సాయవ్వ సోమవారం ఇళ్లకు తాళం వేసి బన్న పెల్లిలోని బంధువుల ఇంటికి వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి ఇళ్ల తాళాలు పగుల గొట్టి నరేశ్ ఇంట్లో బీరువాలో ఉన్న 15 గ్రాముల బంగారం, రూ.10వేల నగదు, నవీన్, సురేష్, సాయమ్మ ఇంట్లో ఐదువేల చొప్పున ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

జింకపిల్లపై కుక్కల దాడి

కుభీర్: మండలంలోని సొనారి గ్రామ శివారులో మంగళవారం దాహం తీర్చుకోవడానికి వచ్చిన జింకపిల్లపై కుక్కలు దాడిచేశాయి. గ్రామస్తులు కుక్కల బారినుంచి జింకపిల్లను విడిపించి అటవీ అధికారులకు సమాచారం అందించారు. అటవీ బీట్ అధికారి లెనిన్ వచ్చి కుభీర్ వైద్యశాలలో వైద్యం చేయించి భైంసా రేంజ్ కార్యాలయానికి తీసుకెళ్లారు.

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	విద్యార్థుల సంఖ్య
నిర్మల్	8,923
ఆదిలాబాద్	10,511
మంచిర్యాల	9,637
కుమురంభీం	6,425



విద్యార్థుల సన్నద్ధతను పరిశీలిస్తున్న నిర్మల్ డీఈవో రవీందర్‌రెడ్డి (ఫైల్)

'పది'ంతల ఆత్మవిశ్వాసం

- పది జీపీఏ లక్ష్యంగా... • సన్నద్ధమవుతున్న విద్యార్థులు
- ఈ నెల 18 నుంచి ఎస్సెస్సీ పరీక్షలు • ఇప్పటికే ప్రీఫైనల్, ప్రత్యేక మోడల్ పరీక్షలు పూర్తి

పదో తరగతి పరీక్షలు మరో ఐదురోజుల్లో ప్రారంభం కానున్నాయి. అయితే సమయం సమీపిస్తున్న కొద్ది విద్యార్థుల్లో కొంతమేర ఆందోళన ఉన్నా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలను ఎదుర్కొంటే మంచి ఫలితాలు రాబట్టవచ్చని మానసికనిపుణులు, సబ్జెక్టు విషయ నిపుణులు సూచిస్తున్నారు. విద్యార్థి జీవితంలో పదో తరగతి అత్యంత కీలకం. తొలిసారిగా బోర్డు పరీక్షలు రాయనున్న విద్యార్థులతో పాటు తల్లిదండ్రుల్లో సైతం ఎంతో ఉత్కంఠ నెలకొంటుంది. అయితే ఏడాదంతా చదివిన పాఠాలను మూడు గంటల్లో సమాధానాలు రాసి మంచి ఫలితాలను సాధించాల్సి ఉంటుంది. ఇక్కడ విద్యార్థికి ఒత్తిడి, ఆందోళన సహజమే. అయినా ప్రశాంతంగా ఉంటూ దృఢచిత్తంతో పరీక్షలు రాస్తే సానుకూల ఫలితాలు ఉంటాయి. రానున్న ఐదు రోజులు పాటించాల్సిన జాగ్రత్తలు, పరీక్షలను ఎదుర్కోవాల్సిన తీరును విషయ నిపుణులు ఇలా వివరిస్తున్నారు. – నిర్మల్‌ఖిల్లా

మాతృభాషను అశ్రద్ధ చేయొద్దు



మాతృభాషను అశ్రద్ధ చేయకుండా ప్రతీ పాఠ్యాంశాన్ని సంగ్రహాత్మకంగా చదవాలి. ఉపవాచకం చదవడం, ముఖ్య ఘట్టాలను సాధన చేయడం వల్ల స్కోరింగ్ పెరుగుతుంది. పరిచిత, అపరిచిత పద్య, గద్యాలను బాగా చదివి అర్థం చేసుకోవడం ద్వారా సమాధానాలు సులభంగా రాయవచ్చు. లేఖ, కరపత్రం, సంభాషణ, వ్యాసం, ఆత్మకథ, ఏకపాత్రాభినయం వంటివాటిపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఓవైపు సాధన చేస్తూనే మరోవైపు ఉల్లాసంగా ఉండాలి. సంధులు, సమాసాలు వంటివాటికీ సమయం కేటాయించి చదివితే పూర్తి మార్కులు సాధించవచ్చు.
– కొండూరి పోతన్న, తెలుగు విషయ నిపుణులు, జెడ్పీహెచ్‌ఎస్, వెల్మల్ బొప్పారం

పొందికగా రాస్తే హిందీకే మార్కులు



హిందీ జాతీయ భాష. ఇందులో ఎక్కువ మార్కులు సాధించడానికి అవకాశం ఉంటుంది. ప్యాసేజీ రైటింగ్‌లో ఇచ్చిన అంశాన్ని క్షుణ్ణంగా చదివితే జవాబులు ఈజీగా రాబట్టవచ్చు. ప్రతీ పాఠ్యాంశంలోని కవి పరిచయాన్ని పూర్తిగా చదవాలి. వ్యాకరణాంశాలు, భాషకి బాత్, అభ్యాసం చేయాలి. సంధులు, ఉపసర్గ వంటివి నేర్చుకుంటే సులభంగానే 10 జీపీఏ సాధించవచ్చు. ఇక పార్ట్ బి పైన కూడా కొట్టివేత, రాత దోషాలు లేకుండా రాయాలి. పద్యభాగం భక్తిపథ్, నీతి దోహే పాఠ్యాంశాలు ముఖ్యమైనవి.– కే.రేఖ, హిందీ పండిత్, జెడ్పీహెచ్‌ఎస్, మంజులాపూర్

కృత్యాలు, అనువర్తనాలు ఆకళింపు ముఖ్యం



భౌతిక రసాయన శాస్త్రాల్లోని ప్రతీ అంశానికి సంబంధించిన కీలక పదాలు చదవాలి. పాఠ్యాంశాల్లోని కృత్యాలు, బొమ్మలు, అనువర్తనాలు గుర్తించుకుని చదివితే జ్ఞాపకముంటుంది. రోజూ సమాధానాలను సాధన చేయడం ద్వారా మంచి మార్కులను సాధించవచ్చు. ఉపయోగాలు–అనువర్తనాలు చదవాలి. ప్రతీ యూనిట్ పూర్తయ్యాక పునఃశ్చరణ చాలా ముఖ్యం. గత పరీక్ష ప్రశ్నలను సాధన చేస్తే ప్రశ్నలు ఏ విధంగా అడుగుతున్నారో గ్రహించవచ్చు. – సీహెచ్. వందన, భౌతికశాస్త్ర ఉపాధ్యాయురాలు, జెడ్పీహెచ్‌ఎస్, భోసి

విశ్లేషణ ద్వారానే మంచి మార్కులు



సాంఘిక శాస్త్రంలో పాఠ్యాంశాలను విశ్లేషణ పూరితంగా చదివితే సులువుగా గుర్తుంటాయి. కీలక అంశాలు, దేశ, ప్రపంచ పటాలను సాధన చేయడం వల్ల స్కోరింగ్ చేయవచ్చు. భారతదేశ పటంలోని పీఠభూములు, తీరమైదాన ప్రాంతాలు, నదులు, రాష్ట్రాలు గుర్తించేలా ప్రాక్టీసు చేయాలి. ప్రపంచ పటంలో దేశాలు, ప్రధాన కార్యాలయాలు, సముద్రాలను గుర్తించగలగాలి. భూగోళం, భూగర్భ జలాలు, కుల వివక్ష, బాలిక విద్య వంటి అంశాలపై, భారతదేశ చరిత్ర వంటి విషయాలను విశ్లేషణచేస్తూ చదవాలి. ప్రతీ ప్రశ్నను అటెంప్ట్ చేయడం కీలకం.
– సిలారి మధు, సాంఘికశాస్త్ర విషయ నిపుణులు, నిర్మల్

ఇష్టపడి చదివితే ఇంగ్లిష్ ఈజీ



ప్రశ్న పత్రం తీసుకున్న తర్వాత అందులో ఉన్న ప్రశ్నలను చూసి ఆందోళన చెందకూడదు. క్షుణ్ణంగా చదివి ఏ ప్రశ్నకు ఎలాంటి సమాధానం రాయనున్నామో ఆకళింపు చేసుకోవాలి. పేరాగ్రాఫ్‌లోని పదాలను కాకుండా సమగ్రంగా అర్థాలు వచ్చే పదాలను ఉపయోగించడం వల్ల సమాధాన పత్రం దిద్దేవారికి మంచి భావన ఏర్పడుతుంది. బాగా వచ్చిన సమాధానాలను మొదట రాసి క్లిష్టతరమైనవి చివర్లో రాస్తే ఆలోచించడానికి సమయం ఉంటుంది.
– కదార్ల రవీంద్ర, ఆంగ్లభాషా విషయ నిపుణులు, నిర్మల్

పట్టు చిక్కితే గణితమే సరళం



గణితం అంటేనే విద్యార్థులు కష్టతరం, క్లిష్టతరం అని భావిస్తారు. కానీ తగిన సాధన చేస్తే గణితంలోనే ఎక్కువ మార్కులు సాధించే అవకాశం ఉంది. తగిన చిట్కాలు పాటించడంతో గణితంపై ఆసక్తి పెరుగుతుంది. సమితులు, రేఖా గణితం, సాంఖ్యాక శాస్త్రం, త్రికోణమితి వంటి పాఠ్యాంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. గ్రాఫ్ నిర్మాణాలకు సంబంధించిన సమస్యలను అభ్యసన చేయాలి. ప్రాక్టీస్ చేస్తే సమాధానాలు సులభంగా రాయవచ్చు. – అశోక్, గణితశాస్త్ర విషయ నిపుణులు, నిర్మల్

అభ్యసన దీపికలతో ప్రయోజనం



జీవశాస్త్రంలో బొమ్మలు గీయడం, ప్రయోగాలు నిజ జీవిత వినియోగం వంటి అంశాలపై వచ్చే ప్రశ్నల ద్వారా ఎక్కువ మార్కులు స్కోర్ చేయవచ్చు. విద్యార్థులకు అందించిన అభ్యసన దీపికలు ఇందుకు అనుకూలంగా ఉన్నాయి. పుస్తకంలోని కీలక అంశాలపై పట్టు సాధించాలి. – మధుసూదన్ దేశ్‌పాండే, జీవశాస్త్ర ఉపాధ్యాయులు, జెడ్పీహెచ్‌ఎస్, సోన్

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్‌పై ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగ కల్పన కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ఉత్తీర్ణులైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రెండు నెలల శిక్షణ అనంతరం ప్రైవేట్ బ్యాంకుల్లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. 26 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు కలిగిన బీసీ అభ్యర్థులు ఈ నెల 15 నుంచి 25 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే 31న ఆన్‌లైన్‌లో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 08732–221280 నంబరులో సంప్రదించాలని సూచించారు.

స్టడీ మెటీరియల్‌కు దరఖాస్తులు

డీఎస్సీ ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు రూ.1,500 విలువ చేసే స్టడీ మెటీరియల్ అందించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 10 వేల మందికి అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ నెల 14 నుంచి ఏప్రిల్ 5 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉమ్మడి జిల్లాలోని బీసీ అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 99496 84959 నంబరులో సంప్రదించాలని సూచించారు.

డీఎస్సీ ఉచిత శిక్షణ

డీఎస్సీ ఉచిత రెసిడెన్షియల్ శిక్షణకు ఎస్సీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ అధికారి సునీత కుమారి, ఎస్సీ స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. డైట్, బీఎడ్ చేసిన ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ అభ్యర్థులు ఈ నెల 12 నుంచి 26 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9494149416 నంబరులో సంప్రదించాలన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికపత్రం అందుకుంటున్న జిల్లా అధ్యక్షుడు కొడప సోనేరావు

ఆదిలాబాద్‌రూరల్: కొలాం హక్కుల పోరాట సమితి జిల్లా కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా టేకం రాజు, జిల్లా అధ్యక్షునిగా కొడప సోనేరావు, ఉపాధ్యక్షులుగా మడావి తుకారాం, కొడప బాపురావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొడప భీంరావు, కార్యదర్శిగా మడావి కిషన్, చాకటి గంగారాం, సహాయ కార్యదర్శులుగా మడావి భీంరావు, మడావి లక్ష్మణ్, కొడప రామారావు, ప్రచార కార్యదర్శులుగా సిడాం ఆనంద్‌రావు, కొడప జంగు, సంస్కృతి కార్యదర్శులుగా టేకం రావుజీ, టేకం పోతు, కుమ్ర నాగోరావు, మడావి చిన్ను, కోశాధికారిగా కుమ్ర జలపత్‌రావు, అధికార ప్రతినిధిగా ఆత్రం ముకుంద్‌రావు, సలహాదారులుగా ఆత్రం భీంరావు, కుమ్ర బాపూరావు, టేకం సోము, కార్యవర్గ సభ్యులుగా ఆత్రం జంగు, టేకం రాజు, మడావి అయ్యు, కొడప లక్ష్మణ్, నైతం అయ్యు, కొడప ధర్మరావు, కుమ్ర రాజేశ్వర్, మడావి రమేశ్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను శాలువా, పూలమాలతో సత్కరించారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

ఆదిలాబాద్‌రూరల్: ఈ నెల 10న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన రైతు చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. మండలంలోని యాపల్‌గూడ గ్రామానికి చెందిన మహేందర్ (36)కు ఐదెకరాల భూమి ఉంది. 2018లో పట్టాకోసం దరఖాస్తు చేసుకున్నాడు. పట్టా కాకపోవడంతో మనస్తాపానికి గురై ఈ నెల 10న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

తానూరు(ముధోల్): ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బెల్‌తరోడా గ్రామానికి చెందిన బెంద్రివాడ్ పోశెట్టి (45) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురై ఈ నెల 11న ఇంటినుంచి వెళ్లిపోయాడు. గ్రామ సమీపంలోని పెట్రోల్ బంక్ వెనుకాల ఉన్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం అటుగా వెళ్లిన రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వృద్ధుడు మృతి



విఠల్ మృతదేహం

బోథ్: విద్యుత్‌షాక్‌తో వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కోటకె గ్రామానికి చెందిన కేంద్రె విఠల్ (66) మంగళవారం ఇంట్లో ఫ్యాన్ వేసేందుకు స్విచ్ ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో రెండిళ్లు దగ్ధం

- రూ.32 లక్షల ఆస్తినష్టం



వట్టోలిలో కాలిపోయిన నోట్లు

లోకేశ్వరం(ముధోల్): మండలంలోని వట్టోలిలో శివరాత్రి ఎగ్గం పెద్ద భూమన్న, ఎగ్గం నడ్పి సాయన్నకు చెందిన ఇళ్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైనట్లు ఆర్ఐ బాలకిషన్ తెలిపారు. గ్రామానికి చెందిన భూమన్న, నడ్పి సాయన్న కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం ఉదయం వివిధ పనుల నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయారు. మధ్యాహ్నం ఇళ్ల నుంచి మంటలు రావడంతో గమనించిన స్థానికులు భైంసా అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ఘటనలో పెద్ద భూమన్న ఇంట్లో రూ.4.70లక్షల నగదు, నడ్పి సాయన్న ఇంట్లో రూ.2.60 లక్షల నగదుతో పాటు ఇంట్లోని సామగ్రి కాలిపోయాయి. ఆర్ఐ బాలకిషన్ పంచనామా నిర్వహించారు. రూ.32 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు ఆర్ఐ తెలిపారు. పూర్తి నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

'మెస్ చార్జీలు విడుదల చేయాలి'



మాట్లాడుతున్న దామెర కిరణ్

ఎదులాపురం: పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలు, ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి దామెర కిరణ్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వం విద్యారంగాన్ని కార్పొరేటీకరణ చేసేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం పేరుకే ప్రజా ప్రభుత్వం అని చెప్తున్నప్పటికీ విద్యా రంగానికి మాత్రం మొండి చెయ్యి చూపుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత వరకు విద్యారంగానికి మంత్రిని కేటాయించకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు.

జిల్లా కమిటీ రద్దు..

ఇప్పటి వరకు కొనసాగిన ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ రద్దు చేస్తున్నట్లు కిరణ్ తెలిపారు. జిల్లా కార్యదర్శిగా పనిచేసిన ఆత్రం నగేశ్ క్రమశిక్షణకు భిన్నంగా వ్యవహరించడంతో ఎస్ఎఫ్ఐ నుంచి బహిష్కరించినట్లు వెల్లడించారు. అనంతరం నూతన కమిటీని ప్రకటించారు. కన్వీనర్‌గా అగ్గిమల్ల సాయి చరణ్, కోకన్వీనర్లుగా కోట్నాక్ సక్కు, ఎస్‌కే సమీర్, కుమ్ర భీంరావు, కమిటీ సభ్యులుగా పోలపాక బన్ని, మగ్గిడి శివ శంకర్, వినోద్‌ను ఎన్నుకున్నారు.

క్షమాపణ చెప్పాలి..

జిల్లా కమిటీకి సమాచారం ఇవ్వకుండా తమను బహిష్కరించడాన్ని ఖండిస్తున్నట్లు ఆత్రం నగేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బహిష్కరణను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

జాతీయస్థాయిలో రాణిస్తున్న విద్యార్థులు

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): గిరిజన క్రీడా పాఠశాలల విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తున్నారని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డెప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్ అన్నారు. మంగళవారం ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్ మైదానంలో జిల్లా స్థాయి గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ శిక్షకులతో నిరంతర పర్యవేక్షణతో క్రీడా పాఠశాలల్లో శిక్షణ కొనసాగుతోందన్నారు. పోటీల్లో 182 మంది బాలురు, 102 మంది బాలికలు పాల్గొన్నారు. జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, సహాయ గిరిజన క్రీడల అధికారులు హేమంత్, లక్ష్మణ్, గోపాల్, శ్రీనివాస్, రవీందర్, జల్పత్, ప్రతాప్‌సింగ్, కోచ్‌లు పాల్గొన్నారు.

ఐదుగురికి ఏడేళ్ల జైలు

ఆదిలాబాద్‌టౌన్: అదనపు వరకట్నం కోసం వేధించిన ఐదుగురికి ఏడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.19వేల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి డాక్టర్ సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ మంగళవారం తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి ఎం.గంగాసింగ్ తెలిపారు. 2018 ఏప్రిల్ 18న నిర్మల్ జిల్లా జయరాంనాయక్ తాండ పరిమండల్‌కు చెందిన స్వప్నకు బోథ్ మండలానికి చెందిన రాథోడ్ జయవంత్‌రావుతో వివాహమైంది. వరకట్నం కింద రూ.3 లక్షల నగదు, తులం బంగారం, మోటర్ సైకిల్ ఇచ్చారు. 15 రోజుల తర్వాత భర్త జైవంతరావు, అత్త ధావిత్రిబాయి, మామ సొమ్ల, బావలు శివరాం, ఆత్మారాం అదనపు కట్నం కోసం వేధించారు. వేధింపులు భరించలేక 2018 ఆగస్టు 11న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. బోథ్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుకాగా పీపీ సంజయ్ కుమార్ వైరాగ్రే 19 మంది సాక్షులను ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో జడ్జి పైవిధంగా తీర్పుచెప్పారు.

చిట్టీల వ్యాపారి అదృశ్యం?

బోథ్: మండల కేంద్రానికి చెందిన ఓ చిట్టీల వ్యాపారి వారం రోజులుగా కనిపించకపోవడంతో అతని వద్ద చిట్టీలు కట్టిన వారు ఆందోళన చెందుతున్నారు. కాగా ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పలు గ్రామాల్లో చిట్టీలు వేసిన వారు గ్రామానికి వచ్చి ఆరా తీస్తున్నారు. చిట్టీల వ్యాపారిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై రాము తెలిపారు.

దంచికొడుతున్న ఎండలు..







వేసవి ప్రారంభంలోనే ఎండలు దంచికొడుతున్నాయి. రోజురోజుకూ ఎండలు పెరిగిపోతుండడంతో మధ్యాహ్న సమయంలో ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి. మార్చిలోనే పరిస్థితి ఇలా ఉంటే ఏప్రిల్, మే మాసాల్లో ఎలా ఉంటుందోనని జనాలు బెంబేలెత్తుతున్నారు. మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలో పలువురు ఎండ నుంచి రక్షణగా రక్షణ కవచాలు ధరించి వెళ్తుండగా 'సాక్షి' క్లిక్ మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్